సాక్షి
అనంతపురం
బుధవారం । 13 । డిసెంబర్ । 2023



'క్వాలిటీ'లో కలహాల కుంపటి

పంచాయతీరాజ్ క్వాలిటీ విభాగంలో ఓ ఉన్నతాధికారి కిందిస్థాయి ఉద్యోగులపై జులుం ప్రదర్శిస్తున్నారు. 8లో



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6.50, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం
33.2°/ 17.1°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

జనవరి 6న జేఎన్‌టీయూ స్నాతకోత్సవం



అనంతపురం: జనవరి ఆరో తేదీన అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ-ఏ) 13వ స్నాతకోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు యూనివర్సిటీల చాన్సలర్/ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు వీసీ ఆచార్య జింకా రంగజనార్దన మంగళవారం తెలిపారు. స్నాతకోత్సవ నిర్వహణకు వివిధ కమిటీలను నియమించినట్లు వెల్లడించారు. స్నాతకోత్సవ వేళ పీహెచ్‌డీ పట్టాలు, గోల్డ్ మెడల్స్ అందజేస్తామని ప్రకటించారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకే విద్యార్థులు జేఎన్‌టీయూకు చేరుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

మణిపూర్ జానపదం అదరహో



సంగీత కచేరీ నిర్వహిస్తున్న మణిపూర్ సత్యసాయి భక్తులు

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన మణిపూర్ సత్యసాయి భక్తులు మంగళవారం సంగీత విభావరి నిర్వహించారు. సాయికుల్వంత్ సభా మందిరంలో సుమారు గంట పాటు కార్యక్రమం జరిగింది. మణిపూర్ జానపద 'నుపి పాల' సంగీత రీతిలో విష్ణుమూర్తి దశావతారాలను వివరిస్తూ సాయి కుల్వంత్ సభా మందిరాన్ని మార్మోగించారు.

వైభవంగా భస్మాభిషేకం



తాడిపత్రి అర్బన్: కార్తీక అమావాస్యను పురస్కరించుకుని మంగళవారం రాత్రి తాడిపత్రిలోని బుగ్గ రామలింగేశ్వర ఆలయంలో కాశీ విశ్వేశ్వరునికి భస్మాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సతీమణి కేతిరెడ్డి రమాదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ దర్మకర్తల మండలి సభ్యులు వీరికి తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల్లో పలువురికి చోటు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనుబంధ కమిటీల్లో జిల్లాకు చెందిన పలువురికి చోటు లభించింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా స్వర్ణలతను నియమించారు. అలాగే యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్‌గా (జోన్-8) యల్లారెడ్డి ప్రణయ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులుగా గొర్ల మారుతి నాయుడు, పామిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా బైరెడ్డిపల్లి రాజేష్‌ను నియమించారు.

కరువు సాయం అందించండి

- ఖరీఫ్ పంట నష్టం కింద రూ.201.80 కోట్లు
- తాగునీరు, ఉపాధి, పశుశాఖకు రూ.128 కోట్లు ఇవ్వండి
- కేంద్ర బృందానికి కలెక్టర్ గౌతమి విజ్ఞప్తి
- క్షేత్రస్థాయిలో కరువు పరిస్థితులు పరిశీలించిన మూడు బృందాలు



గుమ్మఘట్ట మండలం 75 వీరాపురం వద్ద కరువు పరిస్థితిని కేంద్ర బృందానికి వివరిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: లోటు వర్షపాతం నమోదు కారణంగా ఖరీఫ్‌లో పంటలు దెబ్బ తిన్నందున కరువు సహాయక చర్యల కింద జిల్లాకు రూ.329.82 కోట్ల మేర ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కలెక్టర్ గౌతమి కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 28 మండలాలను కరువు జాబితాలో ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం (ఐఎంసీటీ) మంగళవారం జిల్లాలో పర్యటించింది. కేంద్ర బృందానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ (డీఏఎఫ్‌డబ్ల్యూ) జాయింట్ సెక్రటరీ పంకజ్‌యాదవ్ లీడర్‌గా వ్యవహరిస్తున్నారు. మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్, ఫార్మర్ వెల్ఫేర్, ఆయిల్ సీడ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.పొన్నుస్వామి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండేచర్ డిప్యూటీ డైరెక్టర్ మహేష్‌కుమార్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండర్ సెక్రటరీ కైలాష్ షంకలా, కృష్ణా, గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్, సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ అండ్ మానిటరింగ్ అప్రైజల్ పి.దేవేంద్రరావు, ఎంఎన్‌సీఎఫ్‌సీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అనిమల్ హస్బెండరీ, డెయిరింగ్ రీజనల్ ఫాడర్‌స్టేషన్ ఎస్‌టీఏ అంజు బసేరా, నీతి ఆయోగ్ రీసెర్చ్ ఆఫీసర్ అనురాధ బట్నా, జలశక్తి మంత్రిత్వశాఖ అసిస్టెంట్ అడ్వైజర్ ఆర్.సంతోష్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ అండర్ సెక్రటరీ సంజీత్‌కుమార్ సభ్యులుగా వచ్చారు.

- కేంద్ర బృందం మంగళవారం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో ఏర్పాటు చేసిన కరువు పరిస్థితుల ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించింది. కలెక్టర్ అధ్యక్షతన కరువు పరిస్థితులపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమీక్షకు రాష్ట్ర ప్రకృతి విపత్తుల విభాగం మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ హాజరై కరువు గురించి కేంద్ర బృందానికి వివరించారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, వ్యవసాయశాఖతో పాటు పశుసంవర్ధక, పట్టు పరిశ్రమ, ఉద్యానశాఖ, ఏపీఎంఐపీ, రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు. అనంతపురం జిల్లాలో కరువు జాబితాలో ప్రకటించిన 28 మండలాల్లో కరువు పరిస్థితుల గురించి కలెక్టర్ తెలియజేశారు. ఖరీఫ్‌లో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు 449.1 మి.మీకు గాను 36 శాతం తక్కువగా 287.4 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. దీంతో ఖరీఫ్‌లో 3.48 లక్షల హెక్టార్లకు గాను 63 శాతంతో 2.18 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి వచ్చినట్లు తెలిపారు. 28 మండలాల్లో 45 డ్రైస్పెల్స్ (వర్షపాత విరామాలు) ఏర్పడటంతో పంటలు దెబ్బతిన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ నిబంధనల ప్రకారం పంట నష్టం అంచనాలు వేశామన్నారు. 1,84,618 మంది రైతులకు సంబంధించి 1,86,630 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతినడంతో రూ.158.63 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించామని తెలిపారు. అలాగే 50,790 మంది రైతులకు చెందిన 25,395 హెక్టార్లలో మిరప దెబ్బతినడంతో రూ.43.17 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అవసరం ఉందన్నారు. ఇలా 2,12,025 హెక్టార్ల పంటనష్టంతో 2,35,408 మంది రైతులకు రూ.201.80 కోట్ల ఇన్‌పుట్‌సబ్సిడీకి ప్రతిపాదించామని వెల్లడించారు. పశుసంవర్ధకశాఖ పరిధిలో టీఎంఆర్ గడ్డి, చాఫ్‌కటర్స్‌కు రూ.1.74 కోట్లు, గ్రామీణ నీటి సరఫరాకు రూ.7.05 కోట్లు, పట్టణ తాగు నీటి సరఫరాకు రూ.2.72 కోట్లు, ఉపాధిహామీ పథకం కింద అదనంగా రూ.116.52 కోట్లు అందించాలని విజ్ఞప్తి చేశారు.
- అనంతరం పది మందితో కూడిన కేంద్ర బృందం సభ్యులు మూడు బృందాలుగా విడిపోయి క్షేత్రస్థాయిలో పర్యటించారు. అందులో డాక్టర్ కె.పొన్నుస్వామి, మహేష్‌కుమార్, కైలాష్‌శంకలాతో కూడిన మొదటి బృందం అనంతపురం రూరల్ మండలం కందుకూరులో పూర్తిగా ఎండిపోయిన మూడు ఎకరాల కంది పంటను పరిశీలించారు. చియ్యేడుకు చెందిన రవీంద్రారెడ్డి, రామకృష్ణ, మన్నీలకు చెందిన త్రిలోక్‌నాయుడు, కందుకూరుకు చెందిన ఉజ్జినమ్మ, నరసమ్మ అనే రైతులు తాము సాగు చేసిన వేరుశనగ, కంది, చీనీకి జరిగిన నష్టం గురించి తెలియజేశారు. బోర్లలో నీరు తగ్గడం, చెరువులకు నీరు రాకపోవడం వల్ల తాగునీటికి కూడా ఇబ్బందిగా ఉందని మొరపెట్టుకున్నారు. పంటనష్ట పరిహారం పెంచాలని కోరారు. ఆ తర్వాత ఆత్మకూరు మండలం తలుపూరులో రైతులు పోతప్ప, ఎర్రిస్వామికి చెందిన ఆముదం పంటను పరిశీలించిన బృందం సభ్యులు పలువురు రైతులతో మాట్లాడారు. మొదటి బృందం లీడర్ పంకజ్‌యాదవ్ కూడా పాల్గొన్నారు. నోడల్ అధికారి మద్దిలేటి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పామిడి మండలం అనుంపల్లిలో దెబ్బతిన్న ఆముదం పంటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

- పి.దేవేంద్రరావు, డాక్టర్ ప్రదీప్‌కుమార్, అంజుబసేరాతో కూడిన రెండో బృందం కళ్యాణదుర్గం మండలం ముదిగల్లులో రైతులు సాగు చేసిన కంది పంటను పరిశీలించింది. అలాగే ఆముదం, కంది, ఉలవ పంటలు, గుమ్మఘట్ట మండలం 75 వీరాపురంలో ఎండిపోయిన 11.80 ఎకరాల వేరుశనగ పంటను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే కంది, ఆముదం, పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. జిల్లాను ఆదుకోవాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కేంద్ర బృందాన్ని కలిసి విజ్ఞప్తి చేశారు. నోడల్ ఆఫీసర్ ఏడీఏ పద్మలత తదితరులు పాల్గొన్నారు.
- అనురాధబట్నా, సంతోష్, సంజీత్‌కుమార్‌తో కూడిన మూడో బృందం గుత్తి మండలం వన్నేదొడ్డిలో ఆముదం, కంది పంటలను పరిశీలించి తాగునీటి సమస్య గురించి తెలుసుకుంది. పామిడి మండలం అనుంపల్లిలో ప్రతాప్‌రెడ్డికి చెందిన ఆముదం పొలం, ఖాదర్‌పేటకు చెందిన రైతు జయకృష్ణ పత్తి పంటను పరిశీలించారు. అనంతరం అనుంపల్లిలో పలువురు రైతులతో మాట్లాడారు. నోడల్ ఆఫీసర్, ఏడీఏ రోజాపుష్పలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఆత్మకూరు మండలం వడ్డుపల్లి సమీపంలో రైతులతో మాట్లాడుతున్న కేంద్ర కరువు బృంద సభ్యులు

చిన్నారుల ఆరోగ్యానికి పెద్దపీట

- జిల్లాలో 'మిషన్ ఇంద్రధనస్సు' ప్రారంభం
- ఈ నెల 16లోపు 2,670 మంది చిన్నారులకు టీకాల పంపిణీ



చిన్మయ నగర్‌లో టీకా వేస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయి. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా మూడో దశ వ్యాధి నిరోధక టీకా పంపిణీ జిల్లాలో ప్రారంభమైంది. వందశాతం టీకా పంపిణీ లక్ష్యంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు ముందుకెళ్తున్నారు. టీకా డ్రాపౌట్స్ అయిన వారికి టీకాలు వేయనున్నారు. ఈ నెల 11 నుంచి 16 వరకు స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు.

లక్ష్యం 2,670 చిన్నారులు

ఐదేళ్లలోపు చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు అందించాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా చిన్నారుల ఎదుగుదలపై ప్రభావం చూపి ప్రాణం మీదకు వచ్చే ప్రమాదం లేకపోలేదు. ఈ ఏడాది ఆగస్టులో 'మిషన్ ఇంద్రధనస్సు' కార్యక్రమం మొదలైంది. మొదటి దశలో 6,288 మంది లక్ష్యం కాగా 5,722 మందికి టీకా పంపిణీ చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో రెండో దశ టీకా పంపిణీ జరిగింది. అందులో 2,132 మంది లక్ష్యం కాగా 2,210 మందికి టీకా అందించారు. తాజాగా మూడో దశ మొదటి రౌండ్‌లో 2,670 మంది చిన్నారులకు టీకాలు వేయనున్నారు. వీరిలో ఏడాదిలోపు పసికందులు 1621 మంది, ఏడాది నుంచి ఐదేళ్లలోపు చిన్నారులు 1,049 మంది ఉన్నారు. వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న ఏఎన్ఎంలు టీకాలు అందిస్తారు. శిశువు పుట్టినప్పుడు బీసీజీ, ఓపీవీ, హెపటైటిస్, ఆరు వారాల వయసులో ఓపీవీ-1, పెంటావాలెంట్,-1, రోటా -1, ఎఫ్ఐపీవీ -1, పీసీవీ -1, 10 వారాల వయసులో ఓపీవీ 2, పెంటావాలెంట్ 2, 14 వారాల సమయంలో ఓపీవీ- 3, పెంటావాలెంట్ 3, రోటా -3, ఎఫ్ఐపీవీ 3, పీసీవీ -3, 9 నెలల సమయంలో తట్టు, రుబెల్లా, -1, విటమిన్ ఏ 1, పీసీవీ బూస్టర్, ఎఫ్ఐపీవీ 3, జేఈ 1, 16 నుంచి 24 వారాల సమయంలో డీపీటీ, తట్టు, రుబెల్లా, జేఈ, 5 నుంచి 6 ఏళ్లలోపు డీపీటీ అందిస్తారు.

శిశువు ముద్దుగా.. బొద్దుగా

- బరువు తక్కువ చిన్నారుల సంఖ్య భారీగా తగ్గుముఖం
- రాష్ట్రంలోనే మూడవ స్థానంలో నిలిచిన అనంతపురం జిల్లా
- గర్భిణులకు సరైన పౌష్టికాహారం అందడం వల్లే సాధ్యం
- కర్నూలులో 2.03 శాతం ఉండగా.. అనంతలో 2.87 శాతం
- ఐదేళ్ల క్రితం 5 శాతంగా ఉన్న అండర్ వెయిట్ చిన్నారుల సంఖ్య



సాక్షి ప్రతినిధి, అనంతపురం: శిశువు పుట్టగానే మొదట తెలుసుకునేది ఆడ.. మగ అని. ఆ తర్వాత అడిగేది బరువు ఎంత? శిశువు సరైన బరువుతో పుడితే ఎలాంటి శారీరక, మానసిక ఇబ్బందులు ఉండవని డాక్టర్ చెబుతారు. ఇప్పుడు సరైన బరువుతో పుట్టే చిన్నారుల్లో అనంతపురం రాష్ట్ర స్థాయిలోనే మూడో స్థానంలో నిలిచింది. ఐదేళ్ల క్రితం జిల్లాలో బరువు తక్కువ చిన్నారుల సంఖ్య గణనీయంగా ఉండటంతో తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదురయ్యేవి. ఇప్పుడా పరిస్థితి నుంచి పూర్తిగా బయటపడింది. రాష్ట్రంలోనే ఆరోగ్యవంతమైన శిశువుల జననంలో ముందంజ వేసింది.

2.87 శాతం మాత్రమే నమోదు

అనంతపురం జిల్లాలో ఏడాదికి 35వేలకు పైగా ప్రసవాలు జరుగుతుంటాయి. ఇందులో గతంలో 5 శాతానికి పైగా బరువు తక్కువ చిన్నారులు జన్మించేవారు. ఇప్పుడా శాతం 2.87గా నమోదైంది. రాష్ట్రంలో అత్యంత తక్కువగా బరువు తక్కువ చిన్నారులు నమోదైన జిల్లాగా అనంతపురం మూడవ స్థానంలో నిలిచింది. డిసెంబర్ 10 నాటికి జిల్లాలో 26,963 మంది శిశువులు బర్త్ రిజిస్ట్రేషన్ అవగా, అందులో 775 మంది మాత్రమే 2.5 కేజీల కంటే తక్కువ బరువుతో పుట్టారు. 2.03 శాతం చిన్నారులతో కర్నూలు మొదటి స్థానంలోనూ, 2.78 శాతం చిన్నారులతో తూర్పుగోదావరి రెండో స్థానంలోనూ నిలిచాయి. శ్రీసత్యసాయి జిల్లాలో 3.29 శాతం చిన్నారులతో 8వ స్థానంలో నిలిచింది.

గర్భిణులకు సంపూర్ణ పౌష్టికాహారం

రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన సంపూర్ణ పోషణ, సరైన పౌష్టికాహారం పంపిణీతోనే ఇలా బరువు తక్కువ చిన్నారులు పుట్టడం తగ్గినట్టు తెలుస్తోంది. ఆరోగ్యమైన శిశువులు పుట్టడానికి కారణాలు పరిశీలిస్తే...

- గర్భం దాల్చిన మహిళకు క్రమం తప్పకుండా యాంటినేటల్ చెకప్స్ చేయడం.
- రక్తహీనత ఉంటే దానికి తగ్గట్టు నియంత్రణ చేపట్టడం.
- గర్భిణితో పాటు కడుపులో ఉన్న బిడ్డ ఆరోగ్యంగా ఉండటానికి ప్రభుత్వమే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం ఇవ్వడం.
- గ్రామ, వార్డు సచివాలయాల ఏఎన్ఎంలు తమ పరిధిలోని గర్భిణులను గుర్తించి తరచూ ఆరోగ్య వివరాలు సేకరించి తద్వారా మందులు ఇవ్వడం.
- తాజాగా టేక్‌హోం రేషన్ పేరుతో అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ఇంటికే గుడ్లు, పాలు, రాగిపిండి వంటి బలవర్ధకమైన ఆహారం అందించడం.
- దీనివల్ల మానసిక, శారీరక ఎదుగుదల చిన్నారుల్లో బావుంటుంది.

ఈ ఏడాది రాయలసీమ జిల్లాల్లో నమోదైన చిన్నారులు.. వారిలో బరువు తక్కువతో పుట్టిన చిన్నారుల వివరాలు ఇలా..

జిల్లా	నమోదైన చిన్నారులు	బరువు తక్కువ	శాతం
కర్నూలు	31,848	647	2.03
అనంతపురం	26,963	775	2.87
శ్రీ సత్యసాయి	19,608	646	3.29
తిరుపతి	23,937	876	3.66
అన్నమయ్య	17,767	667	3.75
చిత్తూరు	19,978	832	4.16
నంద్యాల	18,862	806	4.27
వైఎస్సార్ జిల్లా	26,372	1,315	4.99

ప్రత్యేక పర్యవేక్షణతో సత్ఫలితం

మహిళ గర్భం దాల్చినప్పటినుంచీ ప్రసవం అయ్యేవరకూ ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నాం. వారి వివరాలు నమోదు చేయడం, రక్తపరీక్షలు చేయించడం, ఫోలిక్ టాబ్లెట్లు, పౌష్టికాహారం పంపిణీ ఇలా అన్ని విధాలుగా గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. దీనివల్లే శిశువులు సరైన బరువుతో పుడుతున్నారు.

–శ్రీదేవి,
ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్

సత్యసాయికి నాగాభరణం



పుట్టపర్తి రూరల్: శ్రీసత్యసాయి బాబా పాలరాతి విగ్రహం మెడలో నాగుపాము చుట్టుకుని అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. పుట్టపర్తి పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లి రహదారి వద్ద గల ఆర్గ్‌సంగ్ విల్లాస్ గృహ సముదాయంలో సోమవారం కన్పించిన ఈ దృశ్యం ఒకరోజు ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. అమెరికాకు చెందిన ప్యాటీ కైన్ మెన్ అనే భక్తురాలు సాయిబాబా విగ్రహాలతో మందిరాన్ని నిర్మించింది. నిత్యం ఆమె పూజలు నిర్వహిస్తూ ఉంటుంది. అనుకోకుండా ఒక పెద్ద నాగుపాము తన ఇంటి ఆవరణలోని మందిరంలోకి ప్రవేశించింది. సత్యసాయి బాబా విగ్రహం మెడకు చుట్టుకుని విగ్రహాన్ని ముద్దాడుతూ కనిపించింది. దీంతో ఆమె ఈ విషయాన్ని సమీపంలోని ప్రజలకు తెలియజేసింది. వారు అక్కడకు చేరుకుని నాగుపాముకు పాలు, నీళ్ల తాపి.. పసుపు, కుంకుమ, పూలు చల్లుతూ పూజలు చేశారు. నాగుపాము కొన్ని గంటల పాటు విగ్రహాన్ని చుట్టుకుని పడగవిప్పి ఆరాధిస్తున్నట్లుగా అక్కడే ఉండి పోయింది.



వేంకటరమణస్వామి ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కమనీయం.. లక్ష దీపోత్సవం

రాయదుర్గంటౌన్: కార్తీక మాసం అమావాస్యను పురస్కరించుకొని మంగళవారం రాత్రి పట్టణంలోని ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం, జంబుకేశ్వరస్వామి ఆలయాల్లో లక్ష దీపోత్సవం, జ్వాలా తోరణోత్సవ కార్యక్రమం కనులపండువగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కాపు భారతి దంపతులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం, జంబుకేశ్వరస్వామి ఆలయంలో జరిగిన లక్ష దీపోత్సవానికి భక్తులు పోటెత్తారు. అనంతరం జ్వాలా తోరణం, సహస్రనామార్చన, ఆకాశ జ్యోతి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే పట్టణంలో మార్కండేయస్వామి ఆలయం, బసవ నాగలింగేశ్వరస్వామి, చన్నవీర స్వామి ఆలయాల్లో అమావాస్య దీపోత్సవం చేపట్టారు.



జ్వాలా తోరణం వెలగిస్తున్న దృశ్యం

నేడు శింగనమలలో 'జగనన్నకు చెబుదాం'

శింగనమల: 'జగనన్నకు చెబుదాం' మండల స్థాయి కార్యక్రమం బుధవారం శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ నిర్మలాకుమారి తెలిపారు. కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. మండల ప్రజలు తమ సమస్యలను అర్జీ ద్వారా విన్నవించుకోవచ్చన్నారు.

క్లుప్తంగా

తపాలా ఉద్యోగుల సమ్మెబాట



అనంతపురంలోని హెడ్‌పోస్టాఫీసు ఎదుట బైఠాయించిన గ్రామీణ తపాలా ఉద్యోగులు

అనంతపురం సిటీ: గ్రామీణ తపాలా ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లిపోయారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నుంచి సమ్మెబాట పట్టారు. తొలి రోజు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,600 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. దీంతో 843 గ్రామీణ ప్రాంత తపాలా కార్యాలయాలు మూతపడ్డాయి. తపాలా సేవలు స్తంభించిపోయాయి. అనంతపురంలోని డివిజన్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరంలో ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ అనంతపురం డివిజన్ కార్యదర్శి కృష్ణయ్య మాట్లాడారు. సమ్మెలోకి వెళ్తే మీకు భవిష్యత్ లేకుండా చేస్తామంటూ కొన్ని చోట్ల ఉన్నతాధికారులు సమ్మెను విచ్ఛిన్నం చేసే కుట్ర పన్నారని మండిపడ్డారు. ఉద్యోగులను బెదిరిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

రికవరీ సొమ్ము అప్పగింత



బాధితుడికి నగదు అందజేస్తున్న పోలీసులు

గుంతకల్లు రూరల్: చోరీ కేసులో నిందితులను అరెస్ట్ చేసి, రికవరీ చేసిన డబ్బును బాధితుడికి పోలీసులు అందజేశారు. వివరాలు... వజ్రకరూరు మండలం తట్రకల్లు నివాసి సోమశేఖర్ ఈ నెల 2న కసాపురం క్షేత్ర దర్శనానికి వచ్చారు. ఆ సమయంలో ఆయన వద్ద ఉన్న రూ.6,900 నగదును దుండగులు అపహరించుకెళ్లారు. ఘటనపై అదే రోజు బాధితుడు ఫిర్యాదు చేయడంతో సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఫుటేజీల్లో నిక్షిప్తమైన సోమశేఖర్ జేబులోని పర్సును కాజేస్తున్న ఇద్దరు దొంగలను గుర్తించి మంగళవారం అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో శ్రీసత్యసాయి జిల్లా, హిందూపురం మండలం మణేసముద్రం గ్రామానికి చెందిన హర్షవర్ధన్, బళ్లారికి చెందిన హసేక్ అన్వారీ ఉన్నారు. వీరి నుంచి రూ.6,900 స్వాధీనం చేసుకుని బాధితుడికి సీఐ మహేశ్వరరెడ్డి, ఎస్‌ఐ సురేష్ అప్పగించారు.

జ్వరంతో బాలిక మృతి



రోషిణి మృతదేహం

గుత్తి రూరల్: తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఓ బాలిక మంగళవారం మృతిచెందింది. స్థానికులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని బళ్లారికి చెందిన జాఫర్‌వలి తన కుటుంబసభ్యులతో కలసి ఊటకల్లులో జరిగే బంధువుల దినకర్మకు వచ్చాడు. అప్పటికే జ్వరంతో బాధపడుతున్న ఆయన కుమార్తె రోషిణి (11)ని సోమవారం ఉదయం స్థానిక ఓ వైద్యుడితో చికిత్స చేయించి సూది మందు వేయించారు. రాత్రి 10 గంటలకు బాలిక అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబసభ్యులు వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రోషిణి మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఎస్సీ కార్పొరేషన్‌కే బురిడీ

- జీసీ సామాజిక వర్గమైనా ఎస్సీ కార్పొరేషన్‌లో రుణం
- తాజాగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సాయానికి దరఖాస్తు
- అనుమానంతో ఆరా తీసిన తుళ్లూరు పోలీసులు
- ఎట్టకేలకు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

అనంతపురం క్రైం: కొందరు ఉద్యోగుల్లోని బలహీనత అతనికి బలమైంది. లొసుగులను బ్లాక్ మెయిల్ చేస్తూ కొందరిని, డబ్బుతో మరికొందరిని బుట్టలో వేసుకుని తన పనులు చక్కబెట్టుసుకుంటూ వచ్చాడు. చివరకు తన కులాన్ని మార్చేసి ఎస్సీగా నకిలీ ధ్రువీకరణ పత్రం పొందిన ఆ మాయలోడు... ఏకంగా ఎస్సీ కార్పొరేషన్‌కే బురిడీ కొట్టించాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని రాజధానిలోని ఉన్నతాధికారులు గుర్తించి చివాట్లు పెట్టడంతో జిల్లా ఎస్సీ కార్పొరేషన్‌లో చలనం వచ్చింది. వివరాలు...



దళితుల పథకాలపై కన్నేసి..

దళితుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తూ పలు పథకాలు అమలు చేస్తుండడంతో వాటిని అప్పనంగా కాజేయాలని అనంతపురంలోని నవోదయ కాలనీకి చెందిన పి.విజయ్‌బాబు భావించాడు. వాస్తవానికి బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆయనకు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పథకాలేవీ వర్తించవు. దీంతో 2018–19లో తాను మాదిగ కులానికి చెందిన వాడిగా నకిలీ కుల ధ్రువీకరణ పత్రాన్ని పొంది నేషనల్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ) కింద ఇన్నోవా వాహనాన్ని తీసుకున్నాడు. ఆ తర్వాత ఎస్సీలకు వర్తిస్తున్న పథకాలు అడపాదడపా కాజేస్తూ వచ్చాడు.

బయటపడిందిలా..

కొద్ది రోజుల క్రితం గుంటూరు జిల్లా తుళ్లూరు నుంచి ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం విజయ్‌బాబు దరఖాస్తు చేసుకున్నాడు. ఆ దరఖాస్తును పరిశీలించిన అధికారులు ఏ జిల్లాకు చెందిన వారని ఆరా తీశారు. దీంతో తాను మాదిగ కులానికి చెందిన వాడినని, తనకు గతంలో ప్రభుత్వం ఇన్నోవా కారు కూడా మంజూరు చేసిందని చెప్పాడు. ఆ సమయంలో అతని ప్రవర్తనపై అనుమానం వచ్చిన అధికారులు వివరాలు సేకరించుకుని పంపేశారు. అనంతరం తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు వేగవంతమైంది. ఎస్సీ కార్పొరేషన్‌ను బురిడీ కొట్టించిన విజయ్‌బాబు... బుడ్డప్పనగర్‌లోని రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో చదువుకున్నట్లు నిర్ధారించుకున్నారు. కాగా, మొత్తం నేరం అనంతపురంలో ముడిపడి ఉండడంతో కేసును జిల్లా పోలీసులకు రెఫర్ చేశారు. విజయ్‌బాబు ఎస్సీ కాదని, బీసీగా నిర్ధారణ అయిన తర్వాత అనంతపురం ఎస్సీ కార్పొరేషన్ అధికారులపై ప్రధాన కార్యాలయ అధికారులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. విచారణ చేపట్టకుండా ఎస్సీలకు చేకూరాల్సిన లబ్ధిని బీసీలకు ఎలా కట్టబెట్టారంటూ నిలదీశారు. దీంతో ఆగమేఘాలపై సోమవారం రాత్రి 9 గంటలకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య చేరుకుని విజయ్‌బాబు చేసిన మోసంపై సీఐ రెడ్డప్పకు ఫిర్యాదు చేశారు.

'క్వాలిటీ'లో కలహాల కుంపటి

- పంచాయతీరాజ్ క్వాలిటీ విభాగంలో ఓ అధికారి వింత వైఖరి
- కింది స్థాయి ఉద్యోగులపై తరచూ నోరు పారేసుకుంటున్న వైనం
- తిరగబడిన ఇంజినీర్లు
- కేకలతో దద్దరిల్లిన కార్యాలయ పరిసరాలు
- చీఫ్ ఇంజినీర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైన ఇంజినీర్లు

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ శాఖ అనుబంధ క్వాలిటీ విభాగంలో పనిచేస్తున్న డివిజనల్ స్థాయి అధికారి ఒకరు తన కింది స్థాయి ఉద్యోగులపై జులుం చేస్తుండడం వివాదాస్పదమైంది. తరచూ ఉద్యోగులపై, కాంట్రాక్టర్లపై నోరు పారేసుకుంటుంటే అసహనానికి గురైన ఉద్యోగులు తిరుగుబాటు బావుటా ఎగరేశారు. దీంతో నాపైనే తిరగబడతారా అంటూ ఆవేశంతో ఊగిపోయిన సదరు అధికారి కేకలేస్తూ చెలరేగిపోయారు. ఇదంతా అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న పంచాయతీరాజ్ శాఖ అనుబంధ క్వాలిటీ విభాగపు కార్యాలయంలో జరిగింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు....

అసలేం జరిగిందంటే..

పీఆర్ శాఖకు అనుబంధంగా ఉండే క్వాలిటీ సెల్ సబ్ డివిజన్ కార్యాలయంలో పని చేసే ఓ అధికారికి, అదే విభాగంలోని కింది స్థాయి ఇంజినీర్లకు మధ్య సోమవారం మధ్యాహ్నం మాటామాటా పెరిగింది. సదరు అధికారి తనదైన శైలిలో నోటికొచ్చినట్లు 'ల'కారాలు అందుకున్నట్లు సమాచారం. దీంతో అసహనానికి గురైన ఉద్యోగులు తాము కూడా కష్టపడి చదివి పైకొచ్చామని, విచక్షణ మరచి మాట్లాడటం సరికాదంటూ ధీటుగా చెప్పారు. దీంతో అధికారికి, ఇంజినీర్లకు మధ్య మాటామాటా పెరిగి గొడవ పెద్దదైంది. గట్టిగా వాదించుకోవడం మొదలుపెట్టారు. దీంతో ఏం జరుగుతుందో అర్థం కాక ఇతర కార్యాలయాలకు పనిపై వచ్చిన జనం అక్కడకు చేరుకుని చోద్యం చూశారు. ఈ గొడవ కాస్త ఆ శాఖ ముఖ్య అధికారి దృష్టికి ఇంజినీర్లు తీసుకెళ్తే.. 'మంచి రోజు చూసుకొని రెస్టారెంట్‌కు పిల్చుకెళ్లండి. అక్కడ పార్టీ ఇచ్చి...ఆయన్ను ప్రసన్నం చేసుకోండి' అంటూ ఉచిత సలహా ఇచ్చినట్లుగా కింది స్థాయి ఉద్యోగులు వాపోతున్నారు.

చీఫ్ ఇంజినీర్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయం

బాధిత ఇంజినీర్లు తమ సమస్యను ఇంజినీర్ల అసోసియేషన్ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. తమపై అధికారి వేధింపులు, నోటి దురుసును రెండేళ్లుగా భరిస్తూ వచ్చామని, ఇక తాము భరించలేకపోతున్నామని, ఇక తాడోపేడో తేల్చుకుంటామంటూ ప్రతినిధుల వద్ద వారు వాపోయారు. ఎలాంటి వేధింపులకు గురవుతున్నారో, ఆయన నుంచి ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారో లేఖ రూపంలో రాసిస్తే విజయవాడలోని పంచాయతీరాజ్ విభాగం క్వాలిటీ సెల్ చీఫ్ ఇంజినీర్‌ను కలసి అందజేస్తామని యూనియన్ ప్రతినిధులు హామీ ఇచ్చినట్లు ఇంజినీర్లు తెలిపారు. ఇదే విషయమై క్వాలిటీ సెల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) మల్లికార్జున మూర్తి వద్ద ప్రస్తావించగా, 'అబ్బే అవునా! ఎప్పుడు జరిగిందిది!! నా దృష్టికి రాలేదే' అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేయడం గమనార్హం.

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి అర్బన్: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. తాడిపత్రి అర్బన్ ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన మేరకు... పట్టణంలోని రాగితోట పాలెంకు చెందిన లక్ష్మీరంగయ్య(60) పక్షపాతం, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన ఆదివారం కుటుంబసభ్యులందరూ ఆలయానికి వెళ్లిన సమయంలో విషపూరిత ద్రావకం తాగాడు. ఆలయం నుంచి ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు... అప్పటికే అచేతనంగా పడి ఉన్న లక్ష్మీనారాయణను గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆయన మృతి చెందారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

చిలమత్తూరు: విద్యార్థినుల ఆరోగ్యంపై అశ్రద్ధ కనబరచరాదని డీసీడీఓ మాధవి సూచించారు. మంగళవారం స్థానిక కేజీబీవీని ఎంపీడీఓ నరేష్‌కృష్ణతో కలిసి డీసీడీఓ పరిశీలించారు. విద్యార్థిని నవ్య ఆత్మహత్యాయత్నంపై సిబ్బందితో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు తెలిపారు. పాఠశాలలో నిర్వహణ లోపం కొట్టొచ్చినట్టు కనబడుతోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. కాలం చెల్లిన పాల ప్యాకెట్లు వాడటంపై అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీసీడీఓ మాధవి

'సజ్జల'ను కలిసిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలంటూ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని పీఆర్టీయూ, వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు కలిసి విన్నవించారు. ఈ మేరకు సోమవారం విజయవాడలో సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన పీఆర్టీయూ, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకుల్లో విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్ కుమార్ రెడ్డి. రజనీకాంత్ రెడ్డి, పీవీ రమణారెడ్డి , నాగిరెడ్డి, సురేందర్ తదితరులున్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించేలా చూడాలని, పీఎఫ్ లోన్లు, మెడికల్ బిల్లుల క్లెయిమ్‌లు చెల్లించాలని, 12వ పీఆర్సీని వెంటనే అమలు చేసేలా చూడాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, కల్పలతారెడ్డి, అప్పిరెడ్డిని కలిసి వినతిపత్రాలు అందజేశారు.



సజ్జల రామకృష్ణారెడ్డితో మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

రూ. 3.19 లక్షలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు!

తనకల్లు: సెల్‌ఫోన్‌ను హ్యాక్ చేసి బ్యాంక్ అకౌంట్ నుంచి రూ. 3.19 లక్షలను సైబర్ నేరగాళ్లు కొట్టేశారు. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు... తనకల్లుకు చెందిన ప్రసాద్ స్థానికంగా ఫర్టిలైజర్ షాపు నిర్వహిస్తున్నాడు. గత నెల ఒకటిన స్థానిక ఎస్‌బీఐలోని తన షాపు అకౌంట్‌లో రూ. 4 లక్షలు జమ చేశాడు. అదేరోజు రాత్రి 9 గంటల సమయంలో అకౌంట్ నుంచి నాలుగుసార్లు రూ. 25 వేలు, ఇంకోసారి 1.29 లక్షలు, మరోసారి రూ. 89 వేలు డబ్బు డ్రా అయినట్లు ఫోన్‌కు మెసేజ్‌లు వచ్చాయి. అప్రమత్తమైన ప్రసాద్ వెంటనే స్థానిక ఎస్‌బీఐ మేనేజర్‌తో పాటు సైబర్ క్రైం సెక్యూరిటీ విభాగం దృష్టికి తీసుకెళ్లాడు. కదిరి డీఎస్పీ శ్రీలత సూచన మేరకు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక పోలీసు అదృశ్యం

అనంతపురం క్రైం: తుమకూరు జిల్లా మధుగిరి తాలూకాలోని మిడిగేసి పోలీసు స్టేషన్‌లో పని చేసే వీరేష్ అనే కానిస్టేబుల్ ఈ నెల 7వ తేదీ నుంచి కనిపించకుండా పోయాడు. ఈ క్రమంలో గాలింపు చేపట్టిన ఆ ప్రాంత పోలీసులు అనంతపురం జిల్లా పోలీసులనూ సంప్రదించారు. కుటుంబ సమస్యల నేపథ్యంలో ఆయన విరక్తి చెంది ఇల్లు విడిచినట్లుగా తెలుస్తోంది. ఆచూకీ తెలిసిన వారు 94808 02976కు సమాచారం ఇవ్వాలని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

జనవాక్కు

కంటిచూపు బాగుపడింది



గుంతకల్లులోని ధర్మవరం గేట్ వద్ద ఓ టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నా. కంటిచూపు తగ్గిపోవడంతో చాలా ఇబ్బంది పడ్డాను. మా సమీప బంధువుల సూచన మేరకు ఈ ఏడాది జూలై 26న కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి పరీక్ష చేయించుకున్నా. అక్కడ డాక్టర్లు నా కుడికన్నుకు ఆపరేషన్ చేశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.20 వరకు ఖర్చులను ప్రభుత్వమే భరించింది. పైగా ఉచితంగా మందులు, వచ్చిపోయే ఛార్జీలనూ చెల్లించింది. ఇప్పుడు కంటి మెరుగుపడింది.ప్రతి నెలా ఒకటో తేదీన వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా లబ్ధి పొందుతున్నా. సీఎం వైఎస్ జగన్ మేలు మరువలేను.

– కె.విమలాదేవి, ధర్మవరం గేట్ ఏరియా, గుంతకల్లు

ఉచిత పంటల బీమాతో ఊరట



గత ప్రభుత్వంలో సాగు చేసిన పంటలు నష్టపోతే కనీస పరిహారం కూడా సక్రమంగా అందేది కాదు. బీమా కంపెనీలకు చెల్లించిన ప్రీమియం మొత్తంలో సగం కూడా చేతికి దక్కేది కాదు. జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మేము ఎలాంటి ప్రీమియం చెల్లించకుండానే పంటల బీమా వర్తిస్తోంది. అది కూడా ఏ సీజన్‌కు సంబంధించిన నష్టాలు అదే సీజన్‌లో అందిస్తుండడంతో ఎంతో ఊరటగా ఉంటోంది. అయితే నిబంధన మేరకు సాగు చేసిన పంటకు ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ చేయించుకుంటే చాలు. నేను సాగు చేసిన మూడు ఎకరాల్లోని చీనీ పంటకూ రూ.60వేలు బీమా పరిహారాన్ని బ్యాంక్ ఖాతాలోకి ప్రభుత్వం జమ చేసింది.

– వెంకటరామిరెడ్డి, పి.చింతలపల్లి, పుట్లూరు మండలం

నాకు మేలు జరిగింది



నా భర్త రవి దివ్యాంగుడు. నేను దోసెలు వేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. గత ఏడాది జూలైలో పెరవలి రంగనాథస్వామి రథోత్సవానికి వెళ్లినప్పుడు ఆటో ఢీకొనడంతో నా కుడికాలు విరిగింది. సచివాలయ సిబ్బంది సూచన మేరకు గుంతకల్లులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాను. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా ఆపరేషన్ చేశారు. 5 రోజుల తర్వాత డిశ్చార్జ్ సమయంలో రూ.4 వేలు నా బ్యాంక్ ఖాతాలోకి ప్రభుత్వం జమ చేసింది. అంతేకాకుండా ఆటో చార్జీలకు రూ.100 చేతికిచ్చి పంపారు. మూడు నెలలకు సరిపడ మందులూ ఉచితంగా ఇచ్చారు. రెండు నెలల పాటు విశ్రాంతి తీసుకున్నా. మొత్తం రూ.70 వేలు వరకూ ఖర్చును జగన్ ప్రభుత్వమే భరించింది. సీఎం వైఎస్ జగన్‌తోనే నాకు మేలు జరిగిందని గర్వంగా చెప్పుకుంటున్నా.

– జె.రంగమ్మ, మండీబజార్ వాటర్ ట్యాంక్ ఏరియా, గుంతకల్లు

లక్షాధికారిని చేశారు



కూలి పనులతో జీవనం సాగిస్తున్న నన్ను సీఎం వైఎస్ జగన్ లక్షాధికారిని చేశారు. జగనన్న కాలనీలో మాకు మంజూరు చేసిన ఇంటి స్థలం లక్షల విలువ చేస్తుంది. ఇంత కాలం అద్దె ఇంట్లోనే కాలం నెట్టుకొచ్చాం. త్వరలో సొంతింట్లోకి చేరుకుంటాం. సీఎం వైఎస్ జగన్ మరో పదికాలాల పాటు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నా.

– ఖతీజా, ఉరవకొండ

ఘనంగా శాంతి ర్యాలీ

పెనుకొండ: పట్టణంలో మంగళవారం శాంతి ర్యాలీ ఘనంగా సాగింది. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన బాబయ్య స్వామి దర్గా 751వ ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని డీఎస్పీ హుస్సేన్‌పీరా ప్రారంభించారు. పీఠాధిపతి తాజ్‌బాబా ఆధ్వర్యంలో 500 అడుగుల జాతీయ జెండా ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రిస్టియన్లు కలసిమెలసి జీవించాలన్నారు. మత సామరస్యాన్ని మరింతగా పెంపొందిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెనుకొండ రవిశంకర్‌గురూజీ, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలిచాంద్‌భాష, ముస్లిం నగారా జాతీయ అధ్యక్షులు ఉమర్‌ఫారూక్, బహుజన వేదిన నాయకులు శివరామకృష్ణ, సమతా సంస్థ ఆదినారాయణరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజినేయులు, పెద్దన్న, హ్యూమన్‌రైట్స్ షమీవుల్లా, ఎంఎస్ మూర్తి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



500 అడుగుల జాతీయ జెండా ఊరేగిస్తున్న దృశ్యం

కాకి వాహనుడి ముంగిట కార్తీక శోభ

పావగడ: స్థానిక శనీశ్వరాలయం కార్తీక శోభ సంతరించుకుంది. కాకివాహనుడి సన్నిధిలో మంగళవారం కార్తీక లక్ష దీపోత్సవం కనులపండువగా సాగింది. ఆలయ సమితి అధ్యక్షుడు ఆనందరావు తదితర పదాధికారులు వేడుకలను ప్రారంభించగా.. దీపాలను వెలిగించడానికి మహిళలు పోటీ పడ్డారు. కొవ్వొత్తుల వెలుగుల్లో ఆలయ ప్రాంగణం దేదీప్యమానమైంది.



శనీశ్వరాలయం పరిసరాల్లో కిక్కిరిసిన భక్తులు



కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు



ప్రత్యేక పూజలందుకున్న స్వామివారు

జిల్లాకు కరువు ప్యాకేజీ ప్రకటించండి

- కేంద్ర కరువు పరిశీలన బృందానికి రైతు సంఘం, సీపీఎం, సీపీఐ నాయకుల వినతి



వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: వర్షాభావం నెలకొని పంట నష్టపోయిన జిల్లా రైతులను ఆదుకునేందుకు కరువు ప్యాకేజీ ప్రకటించేలా కేంద్రానికి సిఫారసు చేయాలని కరువు పరిశీలన కేంద్ర బృందం లీడర్ పంకజ్ యాదవ్‌కు రైతు సంఘం, సీపీఎం, సీపీఐ నాయకులు విన్నవించారు. అలాగే రైతుల రుణాలను మాఫీ చేయాలని కోరారు. వర్షాభావంతో జిల్లాలో చోటు చేసుకున్న పంట నష్టాలను పరిశీలించేందుకు జిల్లాకు మంగళవారం కేంద్ర బృందం విచ్చేసింది. ఈ క్రమంలో సీపీఐ, సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు కలెక్టరేట్‌లో పంకజ్ యాదవ్‌ను వేర్వేరుగా కలసి వినతి పత్రాలు అందజేశారు. పంట నష్టపోయిన రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా ఎకరాకు రూ.50 వేలు చొప్పున గరిష్టంగా నాలుగు హెక్టార్ల వరకూ పరిహారం ఇవ్వాలని విన్నవించారు. ఉపాధి హామీ పథకం కింద 200 రోజుల పని, రోజుకు రూ.600 వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణాల్లోనూ జాతీయ ఉపాధి పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు మల్లికార్జున, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గోవిందు, చిన్నప్పయాదవ్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, కార్యదర్శి వర్గ సభ్యుడు నల్లప్ప, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కాదు..ఊళ్లు

- సొంతింటి కల నెరవేర్చిన జగనన్న
- టీడీపీ హయాంలో కేవలం తెలుగు తమ్ముళ్లకే ఇళ్లు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇళ్లు కాదు.. ఊర్లు నిర్మించింది
- నియోజకవర్గ వ్యాప్తంగా 15,279 ఇళ్లు మంజూరు


ఆలమూరు వద్ద నిర్మించిన జగనన్న ఇళ్లు

ఆత్మకూరు: టీడీపీ హయాంలో కేవలం ఆపార్టీ కండువా కప్పుకుంటేనో.. జెండా మోస్తేనో.. అనునాయులకో ప్రభుత్వ పథకాలు అందేవి.. అర్హులైన పేదలందరికీ అన్యాయం జరిగింది.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత అర్హులందరికీ పార్టీలకతీతంగా న్యాయం జరిగింది. అర్హత ఉంటే చాలు అడక్కుండానే ఇల్లు మంజూరయ్యింది...ఎన్నోఏళ్లుగా పేదలు వేచి చూస్తున్న సొంతింటి కల నెరవేరింది. జగనన్న కాలనీల పేరుతో ఊర్లే నిర్మిస్తున్నారు.

జగనన్న కాలనీల్లో సకల సౌకర్యాలు

ప్రస్తుతం నూతనంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో అధికారులు లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లనూ పూర్తి చేశారు. విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. మట్టి రోడ్లు వేయించారు. అంతేకాకుండా బోర్లు వేయించి, మినీ ట్యాంకులను ఏర్పాటు చేసి, నీటి సమస్య లేకుండా చేస్తున్నారు.

ఇబ్బందులు లేకుండా బిల్లులు

ప్రస్తుతం నిర్మిస్తున్న ప్రభుత్వ ఇళ్లకు సంబంధించి బిల్లుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చూసుకుంటోంది. బేస్‌మెంట్‌తో మొదలుకొని స్లాబ్ వరకు అన్ని బిల్లులను లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తోంది.

వేగంగా ఇళ్ల నిర్మాణాలు

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గ వ్యాప్తంగా ఇంటి నిర్మాణ పనులు వేగంగా చేస్తున్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇటుకలు అందుబాటులో ఉంచారు. అనంతపురం రూరల్ మండలంలో ఆలమూరు, ఆత్మకూరు మండలం సనప గ్రామం వద్ద ప్రత్యేకంగా ఇటుకలు తయారీ చేసి, లబ్ధిదారులకు సరఫరా చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా చాలా చోట్ల ఇళ్లు నిర్మించుకోలేనివారికి ప్రత్యేకంగా కంట్రాక్టర్లను ఏర్పాటు చేసి, శరవేగంగా ఇంటి నిర్మాణాలు చేయిస్తున్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా మండలాల వారీగా మంజూరయిన ఇళ్లు

మండలం	మంజూరయిన ఇళ్లు
ఆత్మకూరు	2,464
రాప్తాడు	2,526
సీకే పల్లి	2,700
రామగిరి	1,814
కనగానపలి	2,150
అనంతపురం రూరల్	3,625
మొత్తం	15,279

జిల్లాలో ఎక్కడా లేని విధంగా రాప్తాడు నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పొచ్చు.



- ' ఈ ఫొటోలో కనిపించే ఇల్లు రామగిరి మండలం పేరూరులోనిది. ఏళ్ల తరబడి టీడీపీ అధికారంలో ఉన్నా, ప్రజలకు కనీసం ఇళ్లు నిర్మించలేదు. సొంతింటి కల నెరవేరదని అందరూ అనుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అర్హులందరికీ అడగకుండానే ఇళ్లు నిర్మిస్తున్నారు. లబ్ధిదారులు ఏకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాన్ని ఇంటి ముందు వేయించారు.'



ఆనందంగా ఉంది



నేను 40 ఏళ్లుగా చూస్తున్నా.నాకు ఆరుగురు సంతానం. ఏ ప్రభుత్వం నుంచి రూపాయి లబ్ధి కూడా వర్తించలేదు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అర్హులుగా గుర్తించి ఇంటి పట్టా ఇచ్చి, ఇళ్లు కూడా మంజూరు చేసినందుకు ఆనందంగా ఉంది. జగనన్న ప్రభుత్వంలోనే మేము మొదటిసారిగా లబ్ధి పొందాం.

– సావిత్రమ్మ, ఆత్మకూరు

సొంతింటి కల నెరవేరింది



గతంలో మాకు ఇల్లు లేదు. సొంతింటి కల ఎప్పుడు తీరుతుందోనని అనుకునేవాళ్లం. జగనన్న ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నా భార్య ముత్యాలమ్మ పేరున ఇల్లు మంజూరయ్యింది. స్థలం కూడా జగనన్న కాలనీలో ఇచ్చారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభోత్సవం చేశాం. జగనన్న ప్రభుత్వంలో సొంతింటి కల నెరవేరినందుకు సంతోషంగా ఉంది.

– శేఖర్, ఆత్మకూరు

పార్టీలకతీతంగా పథకాలు



ఇంత వరకు ఏ ప్రభుత్వం చేయనంతంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తోంది. పార్టీలకతీతంగా పథ కాలు అందిస్తున్నా రు. జగనన్న హయాంలోనే ఇళ్లు నిర్మించుకు న్నా. ఇంటి నిర్మాణాల విషయంలో ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి చొరవ తీసుకుంటున్నారు.

– కృష్ణ, పేరూరు, రామగిరి మండలం

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు



నియోకవర్గ వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలతో పాటు ఇళ్లు కూడా మంజూరు చేయించాం. ఎక్కడా లేని విధంగా రాప్తాడు నియోజకవర్గంలో ఇంటి నిర్మాణాల పనులు వేగంగా జరుగుతున్నాయి. అంతేకాకుండా స్థలం లేకుండా ఉంటే స్థలం వెతికి మరీ లబ్ధిదారులకు స్థలాలు ఇస్తున్నాం. జగనన్న హయాంలో ఇళ్లు కాదు ఊళ్లే నిర్మించాం అని చెప్పుకునేలా చేస్తున్నాం.

– ఎమ్మెల్యే, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి పరామర్శ


టీచరు మల్లేష్ భార్యతో మాట్లాడుతున్న రవీంద్రారెడ్డి, కేవీ రమణ

అనంతపురం ఎడ్యుకేషన్: ఆత్మహత్యాయత్నం చేసి స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు మల్లేష్‌ను జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ వెన్నపూస రవీంద్రారెడ్డి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ మంగళవారం పరామర్శించారు. బాధితుడి భార్యతో మాట్లాడి, ధైర్యం చెప్పారు. రాజకీయ పార్టీల ప్రోద్బలంతో కొన్ని పత్రికలు వక్రీకరించి రాయడం సమాజానికి చెడు సంకేతాలు పంపినట్లువుతుందని రవీంద్రరెడ్డి, కేవీ రమణ అన్నారు. ఇలాంటివి మానుకోవాలని హితవు పలికారు. చివరికి కమ్యూనిస్టులు కూడా సత్యాలు తెలుసుకోకుండా నోటికొచ్చినట్లు ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

యోగాసన పోటీల్లో అనంత చిన్నారుల ప్రతిభ


బహుమతులు అందుకుంటున్న అనంత చిన్నారులు

అనంతపురం కల్చరల్: యోగాసన అసోసియేషన్స్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు సాగిన నాల్గో రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో అనంత చిన్నారులు ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయికి ఎంపికయ్యారు. వివేకానంద యోగా కేంద్ర అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, యోగా గురువులు దివాకర్, కృష్ణ వేణి వద్ద శిక్షణ పొందిన ప్రభావతి ట్రెడిషనల్ యోగాలో, కీర్తినందన సోలో విభాగంలో రాష్ట్రస్థాయి తృతీయ స్థానం దక్కించుకొని జలంధర్‌లో జరిగే జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ మేరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన పోటీలలో అనంత చిన్నారులు బహుమతులందుకున్నారు.

బాధ్యతగా మొక్కలు సంరక్షిద్దాం

అనంతపురం కార్పొరేషన్: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని నగరపాలక సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ లక్ష్మీ ప్రసన్న పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని 26వ డివిజన్ హమాలీ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హరిత నగరాల్లో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మినాక్షి, వైఎస్సార్ సీపీ నాయకులు నాగార్జున్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి


నినాదాలు చేస్తున్న రజక సంఘాల పోరాట సమితి నాయకులు

అనంతపురం అర్బన్: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కలెక్టరేట్ ఎదుట రజక సంఘాల పోరాట సమితి నాయకులు మంగళవారం ఒక్కరోజు నిరాహార దీక్ష చేశారు. సంఘం కోకన్వీనర్ హనుమన్న మాట్లాడుతూ దేశంలోని 18 రాష్ట్రాలు, నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాల్లో రజకులు ఎస్సీ, ఎస్టీ జబితాలో ఉన్నారన్నారు. మిగిలిన 10 రాష్ట్రాల్లో బీసీలుగా కొనసాగుతున్నారన్నారు. ఇప్పటికీ 80 శాతం రజకులు కులవృత్తిపై ఆధారపడి ఆర్థిక వెనుబాటుతో జీవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారుడు, రజక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మీసాల రంగన్న, రజక ఫెడరేషన్ మాజీ చైర్మన్ సి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం


డిప్యూటీ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

రాప్తాడు: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని డిప్యూటీ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం మండలంలోని హంపాపురం సమీపంలోని శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్వీఐటీ) ఇంజినీరింగ్ కళాశాలలో నీ ఓటు నీ హక్కు అనే కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. తహసీల్దార్ మునివేలు, కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ సూర్యశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

వర్షాభావంతో నష్టపోయాం..ఆదుకోండి

- కేంద్ర కరువు బృందాన్ని కోరిన రైతులు


కేంద్ర కరువు బృందానికి వినతిపత్రం అందిస్తున్న ప్రజాప్రతినిధులు, సీపీఎం నాయకులు

ఆత్మకూరు: ఈ ఏడాది వర్షాలు లేక, సాగు చేసిన పంటలు చేతికందక నష్టపోయామని, ఆదుకోవాలని కేంద్ర కరువు బృందాన్ని రైతులు కోరారు. మంగళవారం ఆత్మకూరు మండలం వడ్డుపల్లి సమీపంలోని ఎర్రిస్వామి, పోతప్ప రైతులకు చెందిన ఆముదం పంటలను డైరెక్టర్ ఆఫ్ డెవలప్‌మెంట్ హైదరాబాద్ పొన్నుస్వామి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌పెండీషన్ మహేష్‌కుమార్, రూరల్ డెవలప్‌మెంట్ అండర్ సెక్రటరీ కాలయ్య, జేసీ కేతన్‌గార్గ్ , వ్యవసాయ శాఖ డీడీ మద్దిలేటి రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. ఈ మేరకు రైతులతో పంటల సాగుపై చర్చించారు. రైతులు ఎక్కువగా ఏ పంటలు సాగు చేస్తారు అని అడిగి తెలుసుకున్నారు. వేరుశనగ, ఆముదం, కంది ఖరీఫ్ కింద సాగు చేస్తామని రైతులు తెలిపారు. అనంతరం మండల వ్యాప్తంగా ఉపాధి హామీ జాబ్ కార్డులు ఎన్ని ఉన్నాయి? ఎంత మందిని పనిని వినియోగించుకుంటున్నారు ? అని అధికారులను ప్రశ్నించారు. వేసవి కాలంలో నీటి సమస్య ఉంటే ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారని రైతులు తెలిపారు. అనంతరం ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని రైతులు వారిని కోరారు.

రైతులను ఆదుకోండి: కేంద్ర కరువు బృందానికి మండల ప్రజా ప్రతినిధులతో పాటు, సీపీఎం, సీపీఐ నాయకులు రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు. పంటసాగుకు పెట్టుబడి ఎక్కువగా వస్తోందని, రైతులను ఆదుకోవాలని కోరారు. ఉపాధి హామీ పనులను రైతాంగానికి అనుసంధానం చేయాలని, పండ్ల తోటకు సంబంధించి ఐదు ఎకరాలకు మాత్రమే పరిమితి ఉందని, జిల్లాలో 10 ఎకరాలకు పెంచాలని కోరారు. ఉపాధి పనిదినాలు 100 రోజుల నుంచి 150 రోజులకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో డీఏఓ ఉమామహేశ్వరమ్మ, ఏడీఏ రవి, ఏఓ సుచరిత, ఏఈఓ సుజాత సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన కార్తీక మాసం


నసనకోట ముత్యాలమ్మ


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

అనంతపురం కల్చరల్: కార్తీకమాసం ముగిసింది. మంగళవారం స్థానిక ఉమానగర్‌లోని రేణుకా యల్లమ్మ ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. మాజీ మేయర్ రాగే పరుశురాం, కార్పొరేటర్ బండి నాగమణి ముఖ్య అతిథులుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వయంగా భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు తిరుమల శేఖర్, నరసింహ ప్రసన్న, గోసల లక్ష్మన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- కార్తీక అమావాస్య సందర్భంగా హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో కార్పొరేటర్ గురుశేఖరబాబు ఆధ్వర్యంలో మహాశివుడికి రుద్రాభిషేకాలు, విశేష అలంకార సేవలు నిర్వహించారు.

ఆత్మకూరు: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారంతో కార్తీక మాస ఉత్సవాలు ముగిశాయి. స్వామికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి, పూజలు అందించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


అన్నదానం చేస్తున్న మాజీ మేయర్ రాగేపరశురాం

సంక్షిప్త సమాచారం

ముగిసిన అరుణాచల గిరి ప్రదర్శన

అనంతపురం కల్చరల్: అనంతలో సాయిట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అరుణాచల గిరి ప్రదర్శన మంగళవారం ముగిసింది. మూడోరోడ్డులోని జీఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన అరుణాచలేశ్వరుడిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

ఆత్మకూరు: ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలను అందించాలని డాక్టర్ సబిహా సుల్తానా తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆశా డే నిర్వహించారు. అనంతరం ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లకు 33 మందికి యూనిఫాం అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ షమీం తార, పీహెచ్‌ఎన్ తులసమ్మ, సూపర్‌వైజర్ వెంకటరత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వస్త్రాల పంపిణీ

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో పనిచేసే రెగ్యులర్ కార్మికులకు వస్త్రాలు అందించేలా కమిషనర్ భాగ్యలక్ష్మి చర్యలు తీసుకున్నారు. మంగళవారం నగరపాలక సంస్థలో పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగంలోని 251 రెగ్యులర్ కార్మికులకు కాటన్ చీరలు, టవాళ్లు, బ్లౌజులు తదితర వాటిని సిద్ధంగా ఉంచారు. వివిధ సర్కిళ్లలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు వస్త్రాలు అందించారు.

29న రైతు సంఘం మహాసభలు

రాప్తాడు: జిల్లా కేంద్రంలో ఈ నెల 29న రైతు సంఘం జిల్లా మహాసభలు ఉంటాయని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిరుతల మల్లికార్జున తెలిపారు. మంగళవారం స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలపై నియోజకవర్గ మహాసభల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నప్ప యాదవ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంఘం ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి అధ్యక్షతన జరిగిన ధర్నాలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. మినీ సెంటర్లను ప్రధాన సెంటర్లుగా మార్పు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకురాళ్లు జమున, రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తో నిరంతరాయ సంక్షేమం



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, హాజరైన మహిళలు

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంత వరకూ సంక్షేమం, అభివృద్ధి ఆగదని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. మరో 90 రోజుల్లో ఎన్నికలు రానున్నాయని, మరోసారి వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని 62 సచివాలయాల పరిధిలోని 5వ రోడ్డు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సంక్షేమ, అభివృద్ధి బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం వైస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేస్తేనే పథకాలు వచ్చేవని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హత ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమాన్ని అందించిన విషయాన్ని విపులంగా తెలియజేశారు.

మహిళల గౌరవం పెంచిన ప్రభుత్వం:

గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ద్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని మోసం చేయడంతో మహిళలు ఆర్థికంగా ఎంతో నష్టపోయారని ఎమ్మెల్యే అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నగరంలో రూ.800 కోట్ల వరకు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. పేద ప్రజలకు సొంతింటి కళ సాకారం చేయడానికి నగరంలో 23వేల మందికి ఇంటి పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని టీడీపీ, జనసేన, బీజేపీలు మాటలు చెబుతున్నాయని, 2014 నుంచి 2109 వరకు వీరందరూ కలిసే ఉన్నా, సంక్షేమం, అభివృద్ధి ఏమాత్రం చేయలేదన్నారు. మంచి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ఎల్లో మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు ఇసాక్, టీవీ చంద్రమోహన్ రెడ్డి, శ్రీనివాసులు, రాజేశ్వరి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, క్లస్టర్ అధ్యక్షుడు మధు, ఓబిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వీరా రామకృష్ణా రెడ్డి, నాయకులు నాగరాజు, రామచంద్ర, దాదు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలి

రాప్తాడురూరల్: పేదల బతుకులు మరింత మారాలంటే జగనన్నే మళ్లీ సీఎం కావాలని అనంతపురం రూరల్ ఎంపీపీ వరలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, పార్టీ మండల కన్వీనర్లు రాధమ్మ, గోవిందరెడ్డి, నాయకులు ధనుంజయయాదవ్, పవన్‌కుమార్ అన్నారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలం కొడిమి, నరసనాయనికుంట గ్రామాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం చేపట్టారు. రెండు గ్రామాల్లోనూ వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. కొడిమి సచివాలయ పరిధిలో ఇప్పటిదాకా రూ. 31.66 కోట్ల మేరకు పేదలకు లబ్ధి జరిగింది. అనంతరం డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో బడుగు, బలహీన, ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనార్టీ వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. అర్హత ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మీ, నాయకులు తిరుపాల్‌రెడ్డి, రామాంజనరెడ్డి, డీలర్లు అత్ర పెదయ్య, వడ్డే ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


నరసనాయనికుంటలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సంక్షేమ లబ్ధిని తెలియజేయండి

అనంతపురం కల్చరల్: ముస్లిం మైనార్టీలకు చేకూరిన సంక్షేమ లబ్ధి గురించి తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం విజయవాడలోని పార్టీ మైనార్టీ విభాగం నేతలతో ఆయన రాష్ట్ర స్థాయి సమీక్ష నిర్వహించారు. నగర మేయర్ వసీం, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా బేగ్‌తో పలు అంశాలపై చర్చించారు. ×హర్ దిల్ మే వైఎస్సార్- హమ్ సబ్ జగన్ కే సాత్‌× కార్యక్రమంపై నాయకులు సజ్జల దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంతో పాటు సంక్షేమ పథకాల్లో అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి కల్యాణదుర్గం పర్యటనకు వచ్చిన సమయంలో పటాన్, మొగల్, సయ్యద్‌లను బీసీ- ఈలోకి చేర్చాలని కోరామని, దీన్ని కూడా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని నాయకులు కోరారు.

ఐక్యతతోనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన

అనంతపురం టవర్‌క్లాక్: ఐక్యతతోనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధించుకోవచ్చని ఎంఈఎఫ్ (మాదిగ ఉద్యోగుల సమాఖ్య) జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ అన్నారు. మంగళవారం స్థానిక ఏఈఎఫ్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బండారు శంకర్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటాలు చేస్తున్నారని, ఆయనకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలన్నారు. అందుకోసం ఎంఈఎఫ్ బలోపేతం చేస్తున్నామన్నారు. అనంతరం ఎంఈఎఫ్ నగర కమిటీని ఎంపిక చేశారు. నగర గౌరవాధ్యక్షుడిగా మద్దిలేటి, అధ్యక్షుడిగా మీసాల నాగభూషణం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాయుడు, ప్రధాన కార్యదర్శిగా నారాయణస్వామి, అదనపు ప్రధాన కార్యదర్శిగా హరికృష్ణ, కోశాధికారిగా కిష్టప్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

నేడు పంపనూరులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

ఆత్మకూరు: మండలంలోనిపంపనూరులో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ఎర్రిస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులతో పాటు , ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

'పీడీఎస్‌ఓతో కత్తి ఓబులేసుకు సంబంధం లేదు'

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్‌ఓ) రాయలసీమ జిల్లాల కన్వీనర్‌గా చెప్పుకుంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న కత్తి ఓబులేసుకు, సంస్థకు ఎలాంటి సంబంధం లేదని పీడీఎస్‌ఓ జిల్లా కన్వీనర్ అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం కో కన్వీనర్ సంజీవ్ రాజు, కమిటీ సభ్యులు సందీప్, జస్వంత్, సన్నీతో కలిసి ఓ ప్రకటన విడుదల చేశారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఓబులేసు రాయలసీమ జిల్లాల్లో పీడీఎస్‌ఓ సంస్థ పేరు ఉపయోగించుకొని విద్యా సంస్థల యాజమాన్యాలు, వ్యాపారుల నుంచి డబ్బు వసూలు చేస్తూ ఆర్థిక అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. కడప జిల్లా ప్రొద్దుటూరులోనూ సంస్థ పేరుతో పలు అక్రమాలకు పాల్పడ్డాడన్నారు.

బసవరావు పాదయాత్రకు సంఘీభావం

అనంతపురం కార్పొరేషన్: ఎస్సీ కమిషన్ సభ్యుడు కట్టెపోగు బసవరావు చేస్తున్న పాదయాత్రకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దతు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమం, వై నాట్ 175కి మద్దతుగా ఆయన ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురానికి పాదయాత్ర చేస్తున్న విషయం విదితమే. నగరంలోని జెడ్పీలో ఉన్న వైఎస్సార్, గీతామందిరం సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించి ర్యాలీగా బయల్దేరారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి సప్తగిరి సర్కిల్, సూర్యనగర్ సర్కిల్ కలెక్టరేట్ వరకు జరిగిన ర్యాలీకి మద్దతుగా ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు పెన్నోబులేసు, జేసీఎస్ కన్వీనర్లు చింతా సోమశేఖర్ రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, పార్టీ మహిళా విభాగం జిల్లా, నగర అధ్యక్షురాలు శ్రీదేవి, కృష్ణవేణి, నాయకులు చామలూరు రాజగోపాల్ పాల్గొన్నారు.


బసవరావు పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పండుగలా భారతీయ భాషోత్సవం

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో భారతీయ భాషోత్సవం మంగళవారం పండుగలా జరుపుకున్నారు. విశ్వవిద్యాలయంలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ సభా మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి ఇన్‌చార్జ్ డీన్ ఆచార్య రామిరెడ్డి, తిరుపతి వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య రాజేంద్రప్రసాద్, ఐటీ శాఖ అధ్యాపకురాలు సుమలత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కవి సుబ్రహ్మణ్య భారతి తన మాతృభాషలో రాణించడమే కాకుండా అనేక భాషలు నేర్చుకొని, వాటిని వ్యాప్తి చేసి బహు భాషావేత్తగా నిలచిపోయారని ఆచార్య రామిరెడ్డి కొనియాడారు. భారతీయ భాషల్లోని వివిధ పదాల మధ్య ఉన్న అద్భుతమైన పరస్పర సంబంధాన్ని ఆచార్య రాజేంద్ర ప్రసాద్ వివరించారు. వివిధ రకాల భాషలను మరింత సులభతరం చేయడమే గాక, సమర్థవంతంగా నేర్చుకోవడంలో సాంకేతికత, ఆవిష్కరణల పాత్రను డాక్టర్ సుమలత విశదీకరించారు. ఆధునిక సాఫ్ట్‌వేర్, భాషాభ్యాస ప్రక్రియను మరింత శక్తివంతంగా, శాస్త్రీయంగా తయారు చేసిందని తెలిపారు. అనంతరం భాష, సంస్కృతి ప్రతిబింబించేలా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. గణిత శాఖ అధ్యాపకుడు డాక్టర్ మణివణ్ణన్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.